
# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్‌రాజు





# -40-

## అమెరి'క్యూపాన్ల" కథ...

**మొన్నీ మధ్య** ఒక అమెరికా మిత్రుడు కనపడి, ఏదో మాటల సందర్భం లో "మీ ఇండియన్స్ మా మూడో ఆవిడకి భలే సాయం చేస్తున్నారు" అని నన్ను మెచ్చుకున్నాడు. నేను కాస్త ఆశ్చర్య పోయి "మా ఇండియన్సా? మీ ప్రస్తుత్త సతీమణికి సహాయం చేశారా? అలాంటివి మాకు అలవాటు లేదే" అన్నాను పరిహాసంగా.

"అబ్బే, డైరెక్ట్ గా కాదు. మా ఆవిడకి సేల్స్ పిచ్చి. అంటే....ఎంతో కొంత తగ్గింపు ధర లేనిదే బ్రెడ్ ముక్క కూడా కొని చావదు. అంచేత ఏదైనా కొనదల్చుకుంటే ఇండియన్స్ ఎక్కడ క్యూ కడతారో అక్కడికి వెళ్ళి వాలి పోతుంది. ఇండియన్స్ కొంటున్నారూ అంటే..ఇక వేరే చూసుకో అక్కర లేదు. అది గ్యారంటీ గా అతి తక్కువ ధరే!" అని ఆ దొరా పరిహాసం ఆడాడు.

పరిహాసం మాట ఎలా ఉన్నా, అది వినగానే వాల్ మార్ట్, కాస్ట్ కో, డాలర్ షాపులూ, కె-మార్ట్ ల ముందు మాత్రమే పవిత్ర భారతీయులు తొంబలు తొంబలు గా ఎందుకు కనపడతారో, మిగతా చోట్ల ఎంత వెతికి చూసినా ఒక్క భారతీయ శాల్తీ కూడా ఎందుకు కనపడదో అర్థం అయిపోయి, కాలచక్రంలో ముప్ఫై ఐదేళ్ళు వెనక్కి వెళ్ళి పోయాను.

ఆ రోజుల్లో....

నేను అమెరికాలో చేసిన ఏకైక ఉద్యోగం వెలగబెడుతున్నప్పుడు మాతో పాటు దొరలకి ఊడిగం చేసే మరొక పవిత్ర భారతీయుడు ఉండేవాడు. నూటికి నూరు పాళ్ళు మానసికంగా ఇంకా బెంగాల్ లో సుందర్ బన్ అడవుల్లోనే ఉండి పోయి, బెంగిలింగిలీశు మాత్రమే మాట్లాడుతూ మిత భాషి అయిన అతని పేరు షోంతోష్ మోండోల్ ...మన భాష లో చెప్పాలంటే.. సంతోష్ మండల్ అనమాట. ఒక సారి మా టెక్నికల్ సమావేశాల లో అతను తన ప్రాజెక్ట్ మీద పాపం తనకి వచ్చిన బెంగిలీషు లో అర గంట మాట్లాడి, బంగ్లాయాస పడూతూ ఉంటే వెంటనే రాబర్ట్ రాబర్ట్స్ అనే మా వీర కౌ బాయ్ బాస్ తాలూకు ఎఱ్ర మొహం తెల్ల బోయి, గోధుమ రంగు లోకి మారే లోగా....మీటింగ్ కేన్సిల్ చేసి నన్ను తన ఆఫీసుకి పిలిచాడు. "ఇంతకీ వాడు చెప్పిందేమిటీ? ఆ గొట్టం లో ఆ ద్రావకం పోస్తే అసలు టెంపరేచర్ పెరుగుతుందా, లేదా?" అని మా సంతోషుడి ప్రాజెక్ట్ ప్రసంగ సారాం'షా'న్ని మళ్ళీ నాతో చెప్పించుకున్నాడు. అఫ్ కోర్స్, నేను ఊరుకుంటానా? నా తూ.గో.జిల్లా అగ్రకుల సంజాత తెలుగింగ్లీషు లో తర్జుమా చేసి చెప్పే'షా'ను. అయినా రాబర్ట్ ప్రభువు మొహం గోధుమ, పసుపు మరియు నలుపు రంగులకి మారిపోతే అది నాదా బాధ్యత? మనం మాట్లాడుతున్న వాడి ఇంగిలీసు వాడికే అర్థం అవక పోతే మనం చేసేది ఏమీ లేదు కదా1.

నిజానికి మా సంతోష్ పేరుకి మాత్రమే సంతోష్...కానీ వాడి మొహం లో ఎప్పుడూ గర్భ విచారమే! అసలు ఏ కారణమూ లేకుండానే సర్వ కాల సర్వావస్థలయందూ ఒకేలా ఏడుపు మొహం పెడుతూ మమ్మల్ని సంతోష పెట్టేవాడు మా సంతోష్. "కొందరు తాము నవ్వుతూ

అందరినీ ఏడిపిస్తారు. మరి కొందరు తాము ఏడుస్తూ అందరినీ నవ్విస్తారు" సామెతలో రెండో తరహా వాడు మా సంతోషుడు. అందరిలాగానే అతను కూడా పుట్టినప్పుడు అలా ఏడుస్తూనే పుట్టి ఉంటాడు అని శాస్త్రం చెప్తోంది కదా.....అలాంటప్పుడు అతని పేరు 'విచార్" అనో 'షోక్ సమ్రాట్" అనో పెట్టాలి అని అతని తల్లితండ్రులకి తోచకపోవడం వారికి దూరదృష్టి లేక పోవడమే అని నా ఊహ! ఇలాంటి ఊహల గురించి నేను ఎప్పుడు ప్రస్తావించినా "నీ ఊహ ఎవడిక్కావాలి లే. అన్నీ దురూహలే. ఆ బుర్రలో ఏముందో కానీ అర్థం కాక చస్తున్నాం" అంటుంది మా క్వీన్ విక్టోరియా.

ఇక మామూలు గానే సదా విచారగ్రస్తుడైన మా సంతోషుడు ఒక సారి వాడు కె-మార్ట్ కి వెళ్ళి "ఇరవై శాతం తగ్గింపు" ధర సేల్ లో చెడ్డీలు కొనుక్కున్నాడు. అనగా... ఆరు చెడ్డీల పేకెట్ \$6.99 బదులు \$5.59 డాలర్ల కి మాత్రమే అన మాట. ఆ మర్నాడు ఆఫీసులో అడుగుపెట్టగానే తను ఎంత బ్రిలియంట్ గా డబ్బు 'షేవ్'..అంటే మన భాష లో 'సేవ్" చేశాడో చెప్పి, చీటికీ, మాటికీ తన పంట్లాం కిందకీ, పైకీ లాక్కుంటూ మురిసి పోయాడు. అది చూసి ఆర్ముగం అనే మరొక కోయంబత్తూర్ సహోద్యోగి నంబియార్ లా ఓ నవ్వు నవ్వి "అంత సంతోష పడకు మండలా, రేపు అదే ఆరు చెడ్డీల పేకెట్ టార్గెట్ అనే మరో సూపర్ మార్కెట్ కొట్లో ఇంకా అరవై పైసలకి తక్కువ...కేవలం 4.99 మాత్రమే... కావాలంటే చూడు" అని తన జేబులో కత్తిరించి పెట్టుకున్న ఆ ప్రకటన చూపించాడు. దాంతో తల కొట్టేసినట్టేసినట్టు ఒహటే ఫీలయిపోయి వెంటనే..అంటే కొన్న మూడో నాడే అదే కె-మార్ట్ కి వెళ్ళి ఆ చెడ్డీ పొట్లాం వెనక్కి ఇచ్చెయ్యడానికి వెళ్ళాడు సంతోష్. కొన్న సామాగ్రి వెనక్కి తీసుకునే సంప్రదాయం మొదలైన రోజులు అవి.

"ఎందుకు రిటర్న్ చేస్తున్నావు?" అని ఆ కె-మార్ట్ అమ్మాయి యాదాలాపంగా అడిగింది.

అనుకోని ఆ ప్రశ్నకి బిత్తరపోయి "అది పని చెయ్యడం లేదు" అన్నాడు సంతోష్, తన సహజ సిద్ధమైన ఏడుపు మొహంతో.

"చెడ్డీ పని చెయ్యకపోవడం ఏమిటీ?" అని ఆ పిల్ల కూడా బిత్తర పోయి, అతను ఇచ్చిన ఆ పేకెట్ తెరవ గానే అసంకల్పిత ప్రతీకార చర్యగా ఠపీమని అరడుగు వెనక్కి వేసి, ముక్కు మీద ఒక వేలు కాదు, ఏకంగా అర చెయ్యే అడ్డం పెట్టుకుని "వాడిన చెడ్డీలు వెనక్కి తీసుకోబడవు" అనే కంపెనీ పోలిసీ ని బయటకి తీసి, సంతోష్ ని నిస్సంకోచంగా బయటకి పంపించేసింది సదరు కె-మార్ట్ వనితామణి. అందునా ఆ పిల్ల నల్ల పిల్ల. అది ఇంకా చెప్పుకో లేని చెంప దెబ్బ. భారతీయుల జాతి పైనా, ఆఫ్రికా వాళ్ళు అట్టడుగునా అనేసుకుని సంతోషపడే 'మనోళ్ళు' ఈ కరోనా సమయం లో కూడా చాలా మందే ఉన్నారు. అసలు వివక్ష లేని సంస్కృతే లేదు. కొందరికి కులం. మరి కొందరికి చర్మం రంగు. అందరికీ ఆడా, మగా....అంతే తేడా!

అంతే. టార్గెట్ కొట్టులో కంటే యాభై అమెరికా నయా పైసలు ఎక్కువకి కొనెయ్యడం, దాన్ని వెనక్కి ఇవ్వలేక పోవడం లో ఆఫ్టరాల్ ఒక నల్లమ్మాయి చేతిలో బెంగాలీ బాబుకి జరిగిన ఆ అవమానానికి మా సంతోష్ కి విపరీతమైన దు:ఖం కలిగి, 'వెధవ అమెరికా దేషోమ్...అంతా మోషోమ్" అనుకుంటూ ఒక దీక్ష పూనాడు. 'ముల్లుని ముల్లుతోనే తియ్యాలి' కాబట్టి ప్రతీ సేల్ ప్రకటననీ నమ్మకుండా, అత్యంత తక్కువ ధరలో ఉన్నప్పుడే ఏ వస్తువు అయినా కొనాలి అనేదే ఆ దీక్ష సారాంశం. అలా అని దీక్ష అంటే మన తెలుగు దేశం వారూ, వైయెస్సార్ వారూ, తదితరులూ మెడలో దండలు వేసుకుని ఆరు బయట దేరాల లో ఒక రోజంతా కూచుని, ఏ టీవీ వాడు వస్తాడా, తన 'రాజకీయ కొరుకుడు"....అంటే బైట్ ఇద్దామా అనే బాపతు దీక్ష కానే కాదు. కె-మార్ట్ ముందు అలా నేల మీద కూచుంటే, అంతే సంగతులు.

మా సంతోష్ మండల్ దీక్ష అంటే అది ఒక సాఫ్ట్ వేర్ ప్రాజెక్ట్ లాంటిది అనమాట. దానికి ప్రాతిపదికగా తనని అవమానానికి గురిచేసిన ఆ చెడ్డీల సేల్ గురించే గత ఏడాది, రెండేళ్ళగా జరిగిన సమాచార సేకరణ మొదలు పెట్టాడు. అంటే, ఈ రోజుల్లో ఈ కరోనా ఏ రాష్ట్రం లో ఏ రోజు ఎన్ని కేసులు నమోదు అయ్యాయి, ఎంత మంది డిస్చార్జ్ అయ్యారూ, ఎంత మంది మరణించారూ అనే పద్ధతి లో కింగ్స్ కంపెనీ వారి అండర్ వేర్...అనగా "కడ్డీ వారి చెడ్డీ" లు కె-మార్ట్, వాల్ మార్ట్, టార్గెట్, సియర్స్, జె.సి. పెన్నీ మొదలైన చోట్ల ఏ వారం

ఎంతెంత తగ్గింపు శాతం లో, ఎన్ని రోజులు మొదటి సారిగా అమ్మకానికి పెట్టారు అనే డేటా సమీకరణ మొదటి అంశం. మళ్ళీ అదే ప్రకటన మరెన్ని వారాలకి తిరిగి మరెంత తగ్గింపు ధరతో వచ్చిందీ అనేది రెండో అంశం. ఈ సమాచారాన్ని అంతటినీ ....అనగా ఎప్పుడు, ఏ వస్తువు, ఏ కొట్లో ఎంత తక్కువకి ఎన్నాళ్ళు అందుబాటులో ఉంటుందీ అని ఒక 'అల్గారిథం' తయారు చేశాడు మన వీరుడు. అతి తక్కువ ధరలో సదరు చెడ్డీలు కొనుక్కోడమే కాక, అవి వేసుకున్నా, కోక పోయినా వెనక్కి తీసుకునే స్టోర్ ల వివరాలు కూడా అతని డేటా బేస్ లో ఉంటాయి. ఈ ప్రాజెక్ట్ లో అతను నిమగ్నం అయిన ఆ రెండు, మూడు నెలలూ అతను తన పంట్లాం పైకీ, కిందకీ లాక్కోడం నేను చూడ లేదు. అలాంటి వాటికి కారణం అడక్కూడదు కదా!.

అంతే కాదు. ఆ సమగ్ర సమాచారం నలుగురికీ చెప్పి 'సమాజం అంతటికీ 'షేవ్' చేసి తరించే వాడు మా సంతోషుడు. అంచేత మన పవిత్ర భారతీయులకి ఏ వస్తువు కావలసి వచ్చినా తన కంగాళీ బెంగాళీ బుర్రలో ఉన్న ఆ సాఫ్ట్ వేర్ ని లేపి....ఆ వస్తువు ఏ రోజున ఎంత తక్కువ లో ఎన్ని గంటల సేపు దొరుకుతుందో కాకుండా ఒక వేళ వాళ్ళు రిటర్న్ చేస్తే ఆ స్టోర్ లో కస్టమర్ సర్వీస్ అమ్మాయిలు ఒక సారి సరదాగా వాడినా ఆ  వాసనలు పసి గట్టగల సామర్ధతని కూడా పసి గట్టి చెప్పే వాడు. ఇహ కాచు కోండి.  టాయ్ లెట్ పేపర్ నుంచి, కాదేదీ సేల్ కి అనర్హం అనే బాపతులో పవిత్ర భారతీయులు కొనే సకల సామాగ్రి మీదా తగ్గింపు ధరల సమ్రాట్ అతనే. అతను ఆ రోజుల్లో కారణ జన్ముడు. ఈ రోజుల్లో అయితే గూగుల్ కో మైక్రోసాఫ్ట్ కో సత్య నాదెళ్ళ తోటీ, సుందర్ పిచ్చయ్ తోటీ పోటీ పడే వాడు.

ఉదాహరణకి ఒక సారి, పెళ్ళయిన కొత్తలో మా క్వీన్ విక్టోరియా "మొగుడూ, వచ్చేటప్పుడు నాలుగు వంకాయలు పట్రా, అల్లం, పచ్చి మిరపకాయలూ పెట్టి మాంచి కూర చేస్తాను" అని ఊరించింది.నిజానికి అది బెదిరింపే, ఎందుకంటే అప్పటికి ఆవిడకి వంకాయ తరగడం కూడా రాదు. నేను అమాయకుడిని కాబట్టి మురిసి పోయి మా సంతోష్ తో మాట్లాడుతూ మా ఆవిడ వంకాయల కోరిక చెప్పాను.

"ఓ....ఆంటీకి ఎగ్ ప్లాంటా?" అని వాడు అనగానే నాకు రెండు కారణాలకి ఒళ్ళు మండిపోయింది. నా వయసు వాడే అయిన ఈ వెధవ మా క్వీన్ విక్టోరియాని ఆంటీ అనడం మొదటి కారణం. పైగా అసలు అత్యద్భుతమైన, సొగసైన 'వంకాయ' ని 'గుడ్డు మొక్క'..అనడం..అదే లెండి ..ఎగ్ ప్లాంట్ అంటే మరి అదేగా...అలా అనడం రెండో కారణం. ఆ తరవాత అర గంట లోనూ, మా ఆవిడకి కావలసిన వంకాయలు అమెరికా వారి ఇటాలియన్ భూతాలా, గుత్తి వంకాయలా, ఇచ్చి బాన్, చైనీస్, జపనీస్ వగైరా నీటి వంకాయలా... ఆకుపచ్చగా మచ్చల తో చూడ్డానికి మెట్ట వంకాయల్లాగా ఉండే చచ్చు వంకాయలా ....ఈ వివరాలన్నీ కనుక్కుని మా సంతోష్ మండలుడు నాకు చెప్పిన వివరాలు విని, కాగితం మీద రాసుకుని, అన్నింటికన్నా తక్కుబ ఖరీదులో ఏ గుజరాతీ వాడి కొట్లో దొరుకుతాయో అక్కడికి వెళ్ళి మా ఇద్దరికీ కావలసిన మూడు వంకాయలు కొని ముప్పై పైసలు పొదుపు చేశాను. మా ఇంటి పక్కనే ఉన్న మలయాళీ ని వదలి పెట్టి వాడు చెప్పిన పటేల్ గాడి పచారీ కొట్టుకి వెళ్ళడానికి మూడు డాలర్ల పైనే పెట్రోలు ఖర్చు అయినచో అయ్యెను గాక. ఒక్కొక్క వంకాయకీ పది పైసల తగ్గింపు ధరలో మూడు వంకాయలు కొన్నానా లేదా?

ఇలా రాసుకుంటూ పోతే ఎంతయినా ఉంది కానీ, అప్పుడే కాదు, ఇప్పుడు కూడా అదే పరిస్థితి. కాగితం క్యూపాన్లు తగ్గి కంప్యూటర్ల క్యూపాన్లు వచ్చి పడ్డాయి. అంతే తేడా! కరోనా ధర్మమా అని ఇంట్లోనే కూచుని....వాయిదా పద్ధతిలో,  ఐదేళ్ళు వడ్డీ లేని సదుపాయం తో, క్రెడిట్ చెక్ లేకుండా, సొంత ఇల్లు ఉన్నా,  జైల్లో ఉన్నా...ఏ వస్తువు కొనుక్కోవాలి అనుకున్నా ...అన్నీ సేల్ లోనే....అన్నింటికీ తగ్గింపు ధరలే. ఒక బటన్ నొక్కితే చాలు... విమానం కూడా కొనుక్కోవచ్చును.

ఇక్కడ నాకు వచ్చిన సమస్య అల్లా......ముందు విమానం నడపడం నేర్చుకున్నాక కొనుక్కోవడమా, లేక కొనేసుకున్నాక నేర్చుకోవడమా? విత్తు ముందా? చెట్టు ముందా? గుడ్డు ముందా? పెట్ట ముందా?

"ముందు రోడ్డు మీద దీప స్తంభాన్ని ఆరో సారి కొట్టెయ్యకుండా కారు నడుపు, అప్పుడు చూద్దాం. సైకిలెక్కగానే ధభీమని కింద పడే వాడికి విమానం కావాలిట, విమానం"....దండకం మొదలయింది. ..ఇంకెవరూ ఆవిడే!

**COMMENTS**